జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 27-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 494 పేజీలు: 4 వెల : రూ.7

# ఆమె మరణం..
# ఐదు ప్రాణాలు సజీవం



* రోడ్డు ప్రమాదానికి గురైన హిమావతి బ్రెయిన్ డెడ్ * అవయవ దానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులు * ఐదు అవయవాలతో ఐదు కుటుంబాల్లో వెలుగు * మాకన్నపురం బాధిత కుటుంబీకులపై ప్రశంసల వర్షం



**సోంపేట, అక్టోబరు26(వార్త):** రోడ్డు ప్రమాదానికి గురై ఓ మహిళ కోమాలోకి వెళ్లింది. రెండు రోజుల చికిత్స అనంతరం బ్రెయిన్ డెడ్‌కు గురై ప్రాణం కోల్పోయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమె అవయవాలు ఐదుగురికి దానం చేయడంతో ఆమె మళ్లీ సజీవంగా మారింది. ఓవైపు తల్లిని కోల్పోయామని బరువెక్కిన గుండెలతో తల్లడిల్లిన కూతుళ్లు.. మరోవైపు భార్య లేని లోటు భరించడం ఎలా అంటూ విషాదంలో మునిగిన భర్త.. ఈ క్లిష్ట సమయాన్ని పక్కనపెట్టి ఆమె ఇంకా కొన్నాళ్ళు ఈ ప్రపంచంలో సజీవంగా ఉండాలని భావించారు. మంచి మనసుతో ఆమె అవయవాలను దానం చేసేందుకు స్వతహాగా ముందుకు వచ్చారు. ఆదివారం శ్రీకాకుళం సమీపంలోని జెమ్స్ ఆసుపత్రిలో హిమావతి అవయవాలను వైద్యులు తొలగించి పలు ఆసుపత్రులకు తరలించారు. జెమ్స్ వైద్యులు, సిబ్బంది, కుటుంబీకులు హిమావతి మృతదేహానికి నివాళులు అర్పించారు. వివరాల్లోకి వెళితే సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన ఉలాల హిమావతి (33) ఈనెల 24న కొర్లాం గ్రామం నుంచి స్వగ్రామానికి వేరొకరి బైక్‌పై కూర్చుని వెళుతుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు గాయమైంది. పలాసలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. అక్కడ వైద్యుల సూచన మేరకు శ్రీకాకుళంలోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లిన హిమావతి బ్రెయిన్ డెడ్ కావడంతో శనివారం సాయంత్రం తుది శ్వాస విడిచింది. ఈ పరిస్థితుల్లో స్థానిక వైద్యులు.. అవయవ దానం గూర్చి కుటుంబ సభ్యులకు వివరించారు. దీనికి కుటుంబీకులు అంగీకరించడంతో వెంటనే ఆమెకు చెందిన కళ్ళు, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి అవయవాలను వైద్యులు సేకరించారు. వీటిని భద్రతా ఏర్పాట్ల నడుమ ఇతర ఆసుపత్రులకు తరలించారు. హిమావతి మృతదేహానికి జెమ్స్ వైద్యులు, సిబ్బంది, కుటుంబీకులు నివాళులు అర్పించారు. ఆమె మృతి చెంది మరో ఐదుగురికి జీవం పోషిందని వైద్యులు తెలిపారు. ఆదివారం హిమావతి భౌతికకాయానికి స్వగ్రామం మాకన్నపురంలో అంత్యక్రియలను నిర్వహించారు. ఇదిలా ఉండగా హిమావతి భర్త వెంకట్రావు ఒంగోలులోని కర్ర మిల్లులో పనిచేస్తున్నారు. హిమావతి గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను స్థానిక హైస్కూల్లో చదివిస్తోంది. ఐదుగురికి ప్రాణదానం చేసిన హిమావతి కుటుంబానికి మనసున్న మారాజులు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





# మొంథా.. ముప్పు

* బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం * 28 రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం * శ్రీకాకుళంలో భారీ వర్షం * ఈదురుగాలులు వీచే అవకాశం * మూడు రోజులు పాటు స్కూళ్లకు సెలవు * ఆందోళనలో రైతులు * అప్రమత్తంగా ఉండండి:జేసీ

శ్రీకాకుళం, అక్టోబరు 26 (వార్త): 'మొంథా' తుఫాన్ దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి పోర్టుబ్లెయిర్‌కు 670 కిలోమీటర్లు, చెన్నైకు 720, కాకినాడకు 780, విశాఖపట్నానికి 790, గోపాలపూర్‌కు 900 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయంలోగా నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారి, అదే రోజు రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేసింది. మంగళవారం దాదాపు 12 గంటలపాటు దాని తీవ్రత కొనసాగి, తర్వాత తుపానుగా బలహీనపడొచ్చని పేర్కొంది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురియనుంది. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. కాగా, ఆదివారం అర్ధరాత్రి శ్రీకాకుళం నగరంతో పాటు పలు మండలాల్లో వర్షం కురిసింది. ఈ తుపాను కాకినాడ, కళింగపట్నం మధ్య తీరం దాటుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన రైతులు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికే వరుస తుపాన్లతో అట్టుడికిన జిల్లా రైతులు ఈ మొంథా తుపానుతో ఎటువంటి ఇబ్బందులు పడాల్సివస్తుందోనని ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం నుంచి మూడు రోజులు పాటు స్కూళ్లకు సెలవును ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ ప్రకటించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కేంద్రాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తీర ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రజలకు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచారు.

## ఉద్యమంలా..
## కోటి సంతకాల సేకరణ

* మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లాలో రచ్చబండ సమావేశాలు * తరలివచ్చిన వైసీపీ శ్రేణులు



లోపల పేజీల్లో

## నిరుద్యోగ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

## నేడు దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్ మేళా

# నాగావళిలో దూకేసిన మహిళ

* ఆర్ధిక ఇబ్బందులే కారణం * కుటుంబీకులు వారించినా.. * ఆదివారం అర్ధరాత్రి వరకూ పోలీసులు గాలింపు * దొరకని మహిళ ఆచూకి * ప్రేక్షకపాత్ర పోషించిన అగ్నిమాపక సిబ్బంది * వారి తీరుపై వెల్లువెత్తిన విమర్శలు



**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26 (వార్త):** ఆర్ధిక కారణాల వల్ల శ్రీకాకుళం నగరానికి చెందిన దువ్వ రాజ్యలక్ష్మి ఆదివారం రాత్రి నాగావళి నదిలో దూకేసింది. కుటుంబీకులు వారిస్తున్నప్పటికీ ఆమె వినకుండా నదిలో దూకేయడంతో అక్కడున్న కుటుంబీకులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పోలీసులకు కుటుంబీకులు సమాచారం ఇవ్వడంతో సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాగావళి నది వద్దకు వచ్చి అర్ధరాత్రి వరకూ గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రాజ్యలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు గల కారణాలపై సీఐ ఆరా తీశారు.

### మొద్దునిద్రలో ఫైర్ పోలీసులు

ఓ మహిళ నాగావళిలో దూకేసిందని తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులు అగ్నిమాపక సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. అగ్నిమాపక శకటంతో నాగావళి నది వద్దకు వచ్చి హడావుడి చేశారే తప్ప ఎటువంటి గాలింపు చర్యలు చేపట్టలేదని స్థానికులు మండిపడ్డారు. కనీసం నదిలో గాలింపు కూడా చేయలేదన్నారు. ఏదో వచ్చాం.. అన్న మాదిరిగా నది వద్ద బ్రిడ్జిపై నాలుగు ఫొటోలు తీసుకుని, వివరాలు రాసుకుని తిరిగి అగ్నిమాపక శకటాన్ని తీసుకుని వెళ్లిపోయారు. అగ్నిమాపక సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. శ్రీకాకుళం నగరంలోని అగ్నిమాపక సిబ్బందిలో కొందరు తీరుపై ఆ శాఖలోని అధికారులే అసంతృప్తిగా ఉన్నారు.







## వంశధార కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి



**మందస, అక్టోబరు 26(వార్త):** ఇచ్ఛాపురం వరకు వంశధార కాలువ పొడిగించాలని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని మార్పు గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కమిటీ చేస్తున్న ప్రయత్నాలకు సభ్యులందరూ గ్రామాల్లో స్పందన బాగుందని అభిప్రాయపడ్డారు. ఇచ్ఛాపురం వరకు వంశధార కాలువ పొడిగించడానికి ప్రభుత్వం ఆమోదించాలన్నారు. నవంబరు 2న కార్యవర్గ సమావేశం జరుపుటకు సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డీ, కొర్ల హేమారావుచౌదరి, ఉగిరిపల్లి సోమనాదం, కొవ్వూరు దశరధి, వాయిలపల్లి వరప్రసాదరావు, పెద్దింటి శశిధర్వర్మ, దాసరి పున్నయ్య పాల్గొన్నారు.

# క్వాంటమ్ ద్వారా ప్రపంచాన్ని మార్చొచ్చు

### * ఐబీఎం శాస్త్రవేత్త డా.రితజిత్ మజుందార్



**శ్రీకాకుళం, అక్టోబర్ 26(వార్త):** క్వాంటమ్ సాంకేతికతను ఉపయోగించి భవిష్యత్తులో ప్రపంచంలో అనేక సానుకూల మార్పులను తీసుకురాగలమని ఐబీఎం శాస్త్రవేత్త డాక్టర్ రితజిత్ మజుందార్ ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం ప్రాంగణంలో జరుగుతున్న 'క్విసిక్ ఫాల్ ఉత్సవం- 2025' ఆరవరోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం క్వాంటమ్ సాంకేతిక విజ్ఞానానికి మరొక మైలు రాయిగా నిలిచి, విద్యార్థులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన కొనియాడారు. అనంతరం, ఆయన క్వాంటమ్ అల్గోరిథమ్స్‌పై ప్రేరణాత్మక గోష్టి నిర్వహించారు. క్వాంటమ్ సూత్రాల ప్రాయోగిక అనువర్తనాలు, భవిష్యత్తు సాంకేతికతలో వాటి పాత్ర గురించి వివరిస్తూ యువతలో శాస్త్రీయ ఆసక్తిని పెంచారు. క్యాంపస్‌లో ఆదివారం డాక్టర్ జ్ఞాన్ యల్లా, శ్రీనివాస పీసపాటి, తిలోక్ సాధుఖాన్, డాక్టర్ రితజిత్ మజుందార్ నేతృత్వంలో ఈ హాకథాన్ సాగింది. పలువురు విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలతో క్వాంటమ్ సమస్యలపై పరిష్కారాలు ప్రదర్శించారు. ముఖ్యంగా క్విస్కిట్ వేదిక (ప్లాట్‌ఫారం)పై ప్రాయోగిక పరిశీలనలు చేసి, క్వాంటమ్ విద్యుత్ వలయాల (సర్క్యూట్ల) రూపకల్పనలో తమ ప్రావీణ్యం చూపారు. ఈ క్వాంటమ్ హాకథాన్ విద్యార్థుల్లోని నైపుణ్య వృద్ధికి, సహకార స్ఫూర్తికి అద్దం పట్టింది. క్వాంటమ్ శాస్త్ర రంగంలో యువతకు ప్రేరణగా, సాఫల్యంగా ఆరవ రోజు కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంచాలకులు ఆచార్య కొక్కిరాల వెంకట ధనబాలాజీ, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి డాక్టర్ వాసు, సమన్వయకర్తలు డాక్టర్ రవి గేదెల, కంప్యూటర్ శాస్త్ర విభాగపతి రమేష్ తో పాటు అధ్యాపకులు, అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో గుర్రపు డెక్క తొలగింపు



**పలాస, అక్టోబరు26(వార్త):** బ్రాహ్మణతర్లలో యువత, గ్రామస్తులు శ్రమదానం చేసి చెరువులో ఉన్న గుర్రపు డెక్కను ఆదివారం తొలగించారు. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. చెరువులో స్నానాలు చేసేందుకు వీలు లేకుండా పోయింది. మహిళలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసం రావడంతో వేకువజామున నుంచే మహిళలు చెరువులో స్నానాలు, దీపాలు వెలిగించడం చేస్తుంటారు. ప్రస్తుతం స్నానాలు, దీపాలు వెలిగించేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామానికి చెందిన యువకులు నడుం బిగించారు. చేయి చేయి కలిపి మహిళలు పడుతున్న బాధలను తొలగించేందుకు ముందుకు వచ్చి చెరువులో ఉన్న గుర్రపు డెక్కను శ్రమదానం చేసి తొలగించారు. చెరువు మెట్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గరుగు సింహాచలం, టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ళ కృష్ణారావు, ఆళ్ళ వెంకటావు, తామాడ మోహనరావు మాట్లాడుతూ పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పదేపదే చెప్పిన పట్టించుకోక పోవడంతో మాతో పాటు యువత ముందుకు వచ్చి శ్రమదానం చేసి చెరువు శుభ్రం చేశామని చెప్పారు. మరోమారు శ్రమదానం చేసి పూర్తి స్థాయిలో చెరువు శుభ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గరికి కృష్ణారావు, కొవ్వూరు ధర్మారావు, ఆళ్ళ సోమేశ్వరరావు, ఎండ్ల పాపారావు, శివస్వామి శాసనపురి వెంకట్రావు, బ్రహ్మనీల్, ఆళ్ల ధర్మారావు, బమ్మిడి పాపారావు,, మణికం శ్రీను, లాలాసాహెబ్, కోరాడ వెంకట్రావు, కోరాడు జోగారావు, పట్నాన మోహన్రావు, మణికం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# ఒడిశా నుంచి ఆటోలో నాటు సారా రవాణా

### ముగ్గురు వ్యక్తులు అరెస్ట్, ఆటో సీజ్



మందస, అక్టోబరు 26(వార్త): శ్రీకాకుళం జిల్లాలో నవోదయ 2.0 కార్యక్రమం ద్వారా నాటు సారా తయారీని పూర్తిగా నిర్మూలించి, నాటు సారా రహితజిల్లాగా ప్రకటించిన తర్వాత కొంత మంది పాత నేరస్తులు ఒడిశా నుంచి నాటు సారా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ శాఖాధికారులు సరిహద్దులపై నిఘా ఉంచారు. సోంపేట ఎక్సైజ్ సీజీవీ రమణ, సిబ్బంది ఒడిశా నుంచి నాటు సారా వస్తున్నట్టు రవాణా సమాచారం రావటంతో సిబ్బందితో బయలుదేరి, సోంపేట సర్కిల్ లోని మందస మండలం దేవపురం జంక్షన్ వద్ద కాపు కాశారు. గతంలో నేర చరిత కలిగిన కద్దాల రాజారావు ఆటోతో రావటం గమనించి, ఆటో నిలుపుదల చేయుటకు ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్ళిపోవటంతో, సిబ్బంది గుణాకర్, భాను ప్రసాద్ వెంబడించి పట్టుకున్నారు. ఆటో తనిఖీ చేయగా రెండు ప్లాస్టిక్ గోనె సంచులలో 50లీటర్లు నాటు సారాను గమనించి, అందులో ఉన్న పిడిమందస గ్రామానికి చెందిన కద్దాల రాజారావుతో పాటు ఇప్పిలి ఉమామహేశ్, అగ్గున నారాయణరావులను అరెస్ట్ కేసు చేశామని సీఐ రమణ చెప్పారు. కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసి, ఈ ముగ్గురిని సోంపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ముగ్గురికీ రిమాండ్ విధించటం జరిగిందన్నారు. సిబ్బంది గుణాకర్, భానుప్రసాద్లను అధికారులు అభినందించారు. దాడులలో సోంపేట ఎక్సైజ్ సి.ఐ జీ.వి.రమణ, ఎస్.ఐ.జగన్నాథ్, గుణకర్, మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి పాల్గొన్నారు.

## సక్రమంగా పనిచేస్తేనే గుర్తింపు




**పలాస, అక్టోబరు 26 (వార్త):** విధి నిర్వహణలో సక్రమంగా పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి అన్నారు. ఆదివారం పలాస ఉన్నత పాఠశాలలో డివిజనల్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కొత్త గా నియమితులైన వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు వృత్తి పరమైన నియమ నిబంధనలపై అవగాహన సదస్సు జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు పి.తవిటయ్య నేతృత్వంలో నిర్వహించారు. సుదీర్ఘ కాలము వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘానికి వివిధ స్థాయిల్లో సేవలందించిన విశ్రాంత వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మెంటాడ సాంబమూర్తి దంపతులకు జొన్నల స్థాయి వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సాంబమూర్తి మాట్లాడుతూ వ్యాయామ విద్యను అందించడం వల్ల విద్యార్థులు గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడు యెన్ని శేఖర్ బాబు మాట్లాడుతూ మన వృత్తిపరమైన అంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే మండలం నుండి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిలో మన యంత్రాంగాన్ని ఉపయోగించుకొని సందేహాలను నివృత్తి చేసుకొని వృత్తిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ సలహాదారు కె.రాజారావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మనాభరెడ్డి, పి.గజేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామారావు, జిల్లా అదనపు కార్యదర్శి సీహెచ్ పద్మలోచనం, టెక్కలి జోన్ సెక్రెటరీ కె.ప్రకాష్ రావు, టెక్కల్ నియోజకవర్గం ఎస్జీఎఫ్ సమన్వయకర్త ఎన్.రమేష్, జిల్లా గ్రిక్స్ కార్యదర్శి టి.శ్రీనివాస్ రావు, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె. హరిబాబు, పలాస మండల ఎస్.జి.ఎఫ్ సమన్వయకర్త ఎస్. చంద్రశేఖర్, ఒకటో జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు జి.లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అబుదాబీలో వలస కార్మికుడు మృతి



**సోంపేట అక్టోబరు 26(వార్త):** కంచిలి మండలం గెద్దలపాడు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పొట్టకూటి కోసం కుటుంబాన్ని వదిలి ఖండాంతరాలకు వెళ్లి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే గెద్దలపాడు గ్రామానికి చెందిన నక్క నరసింహారావు (49) ఉపాధి నిమిత్తం అబుదాబి గత ఏడాది వెళ్లాడు. పరాయి దేశంలో ఉపాధి ద్వారా నాలుగు రాళ్లు సంపాదించుకొని పేద కుటుంబాన్ని ఉన్నతికి చేర్చాలని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయనకు కొద్ది రోజుల్లోనే పరిస్థితి తారుమారైంది. అక్కడ ఎన్ఎస్‌హెచ్ కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్న నరసింహారావు శుక్రవారం చివరిసారిగా తన భార్య నారాయణమ్మతో మాట్లాడినట్లు ఆమె విలేకరులకు తెలిపింది. కడుపులో కొంచెం నొప్పిగా ఉందంటూ చికిత్స పొందుతున్నానని భర్త పేర్కొన్నట్లు తెలిపింది. శనివారం నాటికి భర్త చనిపోయినట్లు సమాచారం అందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ వార్త తెలియడంతో గెద్దలపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన భర్త మృతదేహాన్ని స్వదేశానికి వచ్చేలా కృషి చేయాలని నారాయణమ్మ స్థానిక ఎమ్మెల్యే బెందాలం అశోక్‌ను, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును వేడుకుంటోంది.

## గంగాధర్‌కు ఇప్పిలి నివాళి



**సోంపేట, అక్టోబరు 26(వార్త):** సోంపేట ధర్మల్ వ్యతిరేక పోరాటంలో ఎంతో నిబద్ధతగా పోరాడి అందరి మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న పట్నాయకుని గంగాధర్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. సోంపేట పట్టణంలో ఆదివారం గంగాధర్ సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీల పోరాటం చేసిన స్థానిక పర్యావరణ పరిరక్షణ సంఘం నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి, బీన ఢిల్లీరావులతోపాటు కంచిలి జడ్పీటీసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు తదితరులు హాజరై గంగాధర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గంగాధర్ సేవలను గుర్తు చేసుకున్నారు.



## స్నేహితుడి వైద్యం కోసం సహాయం

**సోంపేట, అక్టోబరు26(వార్త):** కవిటి మండలం పొందూరు పుట్టుక గ్రామానికి చెందిన తమ పదో తరగతి క్లాస్ మేట్ దూగాన రమణమూర్తి ఆరోగ్యంగా కోలుకోవాలని ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి ఆదివారం అందజేశారు. కొద్ది రోజుల క్రితం రమణమూర్తితో పాటు కుమారుడు ప్రణయ్ కంచిలి మండలం కుజ్జిరియా గ్రామం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై శ్రీకాకుళంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో 1994-95 టెన్త్ బ్యాచ్ స్నేహితులు 40 వేల రూపాయలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేయడం పట్ల ఆ గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ శయన యువత సహాయం..

సోంపేటకు చెందిన బిన ప్రదీప్ ఆధ్వర్యంలో యువత సేకరించిన 13 వేల రూపాయలను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే గొండ్యాల పుట్టుక గ్రామ శ్రీశయన యువత 46 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందించి బాసటగా నిలిచారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి

**మెళియాపుట్టి, అక్టోబరు26 (వార్త):** అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా అన్నారు. మొంథా తుఫాన్ రానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని సచివాలయాల్లో కంట్రోల్ రూములను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, తహశీల్దారు, ఎంపీడీవోల నేతృత్వంలో మండల టీమ్ ఉంటుందని, ప్రజలకు విద్యుత్, త్రాగునీరు తదితర సమస్యలు ఎక్కడ తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక రద్దు

**శ్రీకాకుళం, అక్టోబరు26(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమము రద్దు చేసినట్లు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు ఎవరు కార్యక్రమానికి రారాదని కోరారు. అధికారులు మొంథా తుఫాన్ సన్నాహక కార్యక్రమాల్లో పాల్గొనవలసి యున్నందున ప్రతి సోమవారము జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే అర్జీల స్వీకరణ కార్యక్రమము, అలాగే మండల కేంద్రాలలో జరిగే ఈ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు తెలియజేశారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాష్ట్ర పదవితో మరింత బాధ్యత

**మందస, అక్టోబరు 26(వార్త):** వెనుకబడిన తరగతుల రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసినందుకు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య కృతజ్ఞతలు తెలిపారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పార్టీ ఈ పదవి ఇచ్చి గుర్తించిందన్నారు. రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని మరింత పెంచుతానన్నారు. పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. బీసీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా నియమించినందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ పదవి రావడానికి సహకరించిన మండల నాయకులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

### ఉద్యమంలా..

* మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు * తరలివచ్చిన వైసీపీ శ్రేణులు * కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తిన వైసీపీ నేతలు * ఈ నిర్ణయం ఉపసంహరించే వరకూ పోరాటం ఆగదన్న నేతలు * అన్ని నియోజకవర్గాల్లోనూ పెద్ద ఎత్తున రచ్చబండ, సంతకాల సేకరణ

# కోటి సంతకాల సేకరణ

**పలాస, అక్టోబరు26(వార్త):**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని వైసీపీ నేతలు నిర్వహిస్తుంటే ప్రజలు, పార్టీ శ్రేణులు ఉవ్వెత్తున తరలివస్తున్నారు. పలాస మండలంలోని లొత్తూరు పంచాయితీలో ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను కాపాడడం కోసం వైసీపీ ఎంతటి పోరాటానికి సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ రాజశేఖర్ (రవి), లొత్తూరు సర్పంచ్ పద్మ, వైస్ ఎంపీపీ ప్రతినిధి లక్ష్మణ్, మోహన్, కొంకడా పుట్టి ఎంపీటీసీ హరి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం ఉమ్మడి సెక్రటరీ చింతాడ మాధవరావు, రాష్ట్ర ప్రచార విభాగా జాయింట్ సెక్రటరీ సురేంద్ర త్యాడి, మండల సర్పంచ్ల ఆదిక్షులు కోర్ల సంతోష్, మండల పార్టీ కార్యదర్శిలు, శిస్టు తేజ, ఖగేశ్వరరావు, లొత్తూరు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, పెద్దలు, యువత పాల్గొన్నారు.



### అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు:కృష్ణదాస్

సంతబొమ్మాళి: అబద్ధాలు,మోసపూరిత వాగ్దానాలతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్ఆర్సిపి శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సంతబొమ్మాళి మండలం తాళ్లవలస, కోటపాడులో ఆదివారం జరిగిన రచ్చబండ కార్య క్రమంలో పాల్గొని కృష్ణదాస్ మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేయడంతో రోగులు రోడ్డున పడ్డార న్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడమే మిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ధనాన్ని దోచుకునేందుకే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని వైసీపీ నేత పేరాడ తిలక్ ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్ రెడ్డి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, కోత సతీష్, కురమాన కృష్ణ, బాలక రామారావు, ఎన్ని మన్మధరావు, మార్పు అశోక్ చక్రవర్తి, హేమసుందర్ రాజు, దుబ్బ వెంకటరావు, చిన్ని జోగారావు, నక్క భీమరావు, సోమేష్, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షులు సింగుపురం వినోద్, రైతు సంఘం అధ్యక్షులు కొన్న శ్రీరాములు, సంతబొమ్మాళి మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీల సభ్యులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నిరుద్యోగ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

**శ్రీకాకుళం, అక్టోబరు 26(వార్త):** జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 31న ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నటువంటి విదేశీ ఉద్యోగ అవగాహన కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. రెండు సంవత్సరాల ఐటీఐ లేదా మూడు సంవత్సరాల ఎలక్ట్రిప్రియన్ ట్రేడ్లో ఉత్తీర్ణత, గరిష్టంగా 30 సంవత్సరాల వయస్సు, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 2,600 నుంచి 2,700 యూరోలు (రూ.2.60 - 2.70 లక్షలు) జీతం లభిస్తుందని చెప్పారు. రెండు సంవత్సరాల ఒప్పందం మేరకు అదనపు పనికి అదనపు వేతనం, వసతి, ఆరైవల్ సహాయం వంటి సౌకర్యాలు యజమానులు అందిస్తారని వెల్లడించారు. అభ్యర్థులకు జర్మన్ భాషలో 12 నుంచి 14 వారాల శిక్షణ రాజమండ్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజుకు ఎనిమిది గంటల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ ఫీజు రూ.1.15 లక్షలని, మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు నవంబర్ 2లోగా apssdc.in వెబ్సైట్లో సమర్పించవచ్చని తెలిపారు. వివరాలకు 9182943285 సంప్రదించాలని ఆయన సూచించారు.

### నేడు దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్ మేళా

దివ్యాంగులు అయిన నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈనెల 27న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ మేళాలో ట్రెండ్స్, బి.పీ.సి.ఎల్, యూత్ ఫర్ జాబ్స్ వంటి పలు ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 50పై చిలుకు ఖాళీలకు నియామకాలు చేపడతారన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై చదివిన 18 నుండి 35 ఏళ్ల మధ్య వయసున్న దివ్యాంగులు అయిన నిరుద్యోగ యువతి యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూ లో సెలెక్ట్ అయిన వారికి విశాఖపట్నంతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్పోర్ట్ సైజు ఫోటోతో కలిసి ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రాంగణానికి రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9182943285 నంబర్ను సంప్రదించవచ్చని చెప్పారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వెంకటే కుటుంబానికి రూ.2,63లక్షలు ఆర్థిక సాయం



**కోటబొమ్మాళి, అక్టోబరు26 (వార్త):** చలమయ్యపేట గ్రామానికి చెందిన సైన వెంకటే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.2.63.000లు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. శ్రీపాలపోలమ్మతల్లి కమిటి సభ్యులు రూ.2.33లక్షలు, అలాగే కొన్ని గ్రామాలనుంచి రూ.30వేలు విరాళాలు స్వీకరించి మొత్తం రూ.2.63 లక్షలు వెంకటే కుటుంబానికి గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలపోలమ్మతల్లి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## మొక్కలతోనే మానవ మనుగడ

**మందస, అక్టోబరు 26(వార్త):**మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, గ్రీన్ మందసకు అందరి కృషి ఎంతో అవసరమని గో గ్రీన్ మందస ఆర్గనైజేషన్ నాయకులు అన్నారు. గో గ్రీన్ మందస ఆధ్వర్యంలో మందస పట్టణంలోని మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందసను పచ్చదనానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మందసలో నాటిన మొక్కలను సంరక్షించగలిగితే హరిత మందస సాధ్యపడుతుందన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా మెయిన్ రోడ్డును పచ్చగా తీర్చిదిద్దడం అవుతుందన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు, గో గ్రీన్ సభ్యుడు గిన్ని తిరుపతిరెడ్డి, జనసేన జిల్లా నాయకుడు సంతోష్ పండా, శ్రీనివాస్ పాడి, రచయిత మామిడి కోదండరావు, రాధాకృష్ణ పట్నాయక్, ఇప్పిలి కేశవరావు(చిట్టి), మల్లారెడ్డి రాజు, సుశాంత్ కుమార్ రౌళో, తమ్మినేని అనిల్ పాల్గొన్నారు.

## రద్దీగా మారిన ఆదిత్యాలయం

**అరసవల్లి, అక్టోబరు26 (వార్త):**ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. క్యూలైన్లలో భక్తులు బారులు దీరారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.6,04,500లు, పూజలు మరియు విరాళాల రూపంలో రూ.74,508లు, ప్రసాదాల రూపంలో రూ.2,85,750లు ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.

## మండలంలో యూత్ ఫెస్టివల్

**మెళియాపుట్టి, అక్టోబరు 26(వార్త):**మండలంలో యూత్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్‌డిఆర్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోరువెల్లి చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెఇపారు. జిల్లా కలెక్టర్, డివిఈఓ ఇంటర్మీడియట్ విద్య శ్రీకాకుళం వారి ఆదేశాల మేరకు మెళియాపుట్టి మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు యూత్ ఫెస్టివల్ పోటీలలో భాగంగా వివిధ ఈవెంట్లలో ఫోక్ డాన్స్, సాంగ్స్, పోయెట్రీ రైటింగ్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్ తదితర పోటీలను ఈ నెల 28న ప్రభుత్వ జూనియర్ కళాశాల మెళియాపుట్టిలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు తెలియజేశామన్నారు. మండల స్థాయి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థుల వివరాలు ఈ నెల 27తేది ఉదయం 10 గంటల లోపు మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించాలన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు 'జనసేన' సాయం



**మందస, అక్టోబరు 26(వార్త):**బుడారిసింగి పంచాయతీలో గల సవర పద్మాపురంకాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సవర లాలు, సవర ఉదవ్, సవర ఢిల్లీ, సవర శోభన్లకు చెందిన పురిల్లు పూర్తిగా కాలిపోయాయి. నిరుపేద కుటుంబాలైన గిరిజనులకు జనసేన పార్టీ నాయకులు ఆదుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున నగదుతో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుప్పయి గోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండ, మండల ఉపాధ్యక్షుడు సవర శివ, మండల కార్యదర్శులు పినింటి వాసు, బదకల భాస్కర్, బమ్మిడి మహేష్, సాగర్‌తో పాటు జనసైనికులు పాల్గొన్నారు.

## బాలి యాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ

**జలుమూరు, అక్టోబరు26(వార్త):** శ్రీముఖలింగంలో కొలువైన మధుకేశ్వర స్వామి బాలి యాత్ర నవంబర్ నెల 9వ తేదీన జరగనుంది. ఈ బాలి యాత్రకు సంబంధించిన గోడ పత్రిక, ఆహ్వాన పత్రికలను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. నవంబర్ నెల 9వ తేదీన బాలి యాత్ర జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. బాలి యాత్ర నిర్వహణ, విశిష్టత తెలియజేస్తూ గోడ పత్రికలను ఆవిష్కరించినట్లు తెలిపారు.



## ఆదమరిస్తే.. అంతే మరి!

* ప్రయాణీకులకు పొంచి ఉన్న ప్రమాదం
* పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
* ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనులు





**మందస, అక్టోబరు 26(వార్త):**పాపం ప్రయాణీకులు.. ఇప్పటికే పలుమార్లు ప్రమాదానికి గురయ్యారు.. ప్రాణాలయితే పోలేదు కానీ.. ఎప్పుడు.. ఎవరూ.. ప్రమాదానికి గురవుతారోనని గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు.. గిరిజన ప్రాంతంలో గల ఈ స్థలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది, కొద్దిగా ప్రారంభమైన ఈ ప్రమాదస్థలం నేడు నరకానికి మార్గంగా మారింది. మందస మండలంలోని పలు గిరిజన పంచాయతీలున్నాయి. వీటిలో ప్రధానంగా కిల్లోయి, బంజిరియువరాజపురం మీదుగా కుడుమాసాయి తదితర గిరిజన గ్రామాలను కలిపే రహదారి అధ్వాన్నంగా మారింది. గతంలో వేసిన తారురోడ్డు కొన్ని చోట్ల నామారూపాల్లేకుండా తారురోడ్డు మారిపోయింది. రోడ్డుకు ఆనించి, గోతులు ఏర్పడ్డాయి. బంజిరియువరాజపురం కల్వర్టు శిథిలాస్థకు చేరుకోగా, రోడ్డు పాడై కనీసం ద్విచక్రవాహనం కూడా తప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మహేంద్రగిరులపై గల గిరిజన గ్రామాలు, పంచ పాండవుల ఆలయాలు దర్శించుకోవడానికి కూడా రహదారి ఉంది. సరిహద్దు ప్రాంతాల రహదారులను అభివృద్ధి చేయలేని దుస్థితిలో ఐటీడీఏ అధికారులు ఉన్నారు. దీంతో చిత్రంలోని చూపిన ప్రాంతం నరకానికి ప్రవేశమార్గంలా మారింది. తక్షణమే ఐటీడీఏ అధికారులు కానీ, మందస మండల అధికారులు కానీ స్పందించి, ప్రమాదస్థలాన్ని బాగు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## ప్రకాశనగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్



**కోటబొమ్మాళి, అక్టోబరు26(వార్త):** స్థానిక మేజరు పంచాయతీ పరిధిలో గల ప్రకాశనగర్ కాలనీలో ఆదివారం ఎస్ఐ వి.సత్యన్నారాయణ తన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానస్పద ప్రాంతాలను తనిఖీలు నిర్వహించి, పలు వాహనాల రికార్డులు పరిశీలించారు. ఎలాంటి పత్రాలు లేని 96 ద్విచక్రవాహనాలను స్వాదీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాలనీ యువకులతో మాట్లాడుతూ తమ ద్విచక్రవాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలని, హెల్మెట్ తప్పని సరిగా వినియోగించాలన్నారు.

### నరసన్నపేటలో..

నరసన్నపేట మండల కేంద్రంలోని హడ్కో కాలనీలో ఆదివారం ఉదయం చేపట్టిన కార్డెన్ సెర్చ్‌లో భాగంగా 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని స్థానిక గ్రామస్తులకు సూచించారు. అలాగే ఎటువంటి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

## బావిలో పడి యువకుడు మృతి

**కోటబొమ్మాళి, అక్టోబరు 26 (వార్త):**కోటబొమ్మాళి పంచాయతీ ఉప్పరపేట గ్రామానికి చెందిన దండుపాటి గౌరినాయుడు (32) ఆదివారం బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు గౌరినాయుడు మద్యం అలవాటు ఉండటంలో మద్యం తాగి స్నానానికి బావిలో దిగి మునిగి మృతి చెందాడు. దీన్ని గమనించిన కొందరు గ్రామస్థులు అతనిని ఒడ్డుకు తీసువచ్చి 108 అంబులెన్సుకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అతనని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడుకు భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు చిన్న, కల్పనలు ఉన్నారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు.

## గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరగాలి

**సారవకోట/జలుమూరు, అక్టోబరు26(వార్త):**గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరగాలని ప్రవచన కర్త సనపల కరుణాకర్ సూచించారు. ఆదివారం సారవకోట మండలం బుడితిలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరిగితే ఆ గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయన్నారు. దీంతో గ్రామ అభివృద్ధి, సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయనతో పాటు పలువురు వక్తలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

## భగవద్గీత పోటీల్లో చిన్నారి ప్రతిభ

**సారవకోట/జలుమూరు,అక్టోబర్26(వార్త):**సారవకోట మండల కేంద్రానికి చెందిన పారశెల్లి రిషిత భగవద్గీత పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదివారం నరసన్నపేటలో ఓ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పారాయణం పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బహుమతి పొందింది. రిషిత చిన్నతనంలో భగవద్గీతను అనర్గళంగా పారాయణం చేసి అందరినీ ఆకర్షించింది.

## యువత ఆధ్యాత్మిక వైపు అడుగులు వేయాలి




**పలాస, అక్టోబరు26 (వార్త):** యువత ఆధ్యాత్మిక వైపు అడుగులు వేయాలని సత్యసాయి ట్రస్టు జోనల్ ఇన్చార్జ్ బైరాగి, శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ శ్రీ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 1100వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాశీబుగ్గ శ్రీ సత్యసాయి మందిరం నుండి పలాస శ్రీ సత్యసాయి మందిరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మందిర ట్రస్టు సభ్యులు ఎన్.నారాయణ రావు, ఎస్.నాగరాజు, తిరుముల, శరత్, కంతేయుడు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా రహదారులు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు26(వార్త):**నరసన్నపేట నుంచి పోలాకి మండలం చీడివలసకు చెందిన రహదారిలో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గడిచిన మూడేళ్లుగా ఈ రహదారికి మరమ్మతులు జరగకపోవడంతో అడుగడుగునా గుంతలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన ముళ్ల తీగలు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు26(వార్త):**నరసన్నపేట పట్టణంలోని పోలాకి రహదారిలో ప్రశాంతి నగర్ వద్ద విద్యుత్ స్తంభానికి ముళ్ల తీగలు అల్లుకుపోవడంతో విద్యుత్ ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. రహదారిపై స్పష్టంగా ఇది కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. దీనివల్ల అప్పుడప్పుడు మంటలు కూడా చెలరేగుతున్నాయని వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## కిల్లాం పంచాయితీలో పారిశుధ్య పనులు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు26(వార్త):**నరసన్నపేట మండలం కిల్లాం పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం ఉదయం స్థానిక సర్పంచ్ బోడి రామన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారులపై వ్యర్థాలు, మట్టి చేరిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ఈ చర్యలు చేపట్టామన్నారు. అలాగే మురుగు కాలువలు పరిశుభ్రం చేశామని తెలిపారు. పారిశుధ్యం పట్ల ప్రజల అవగాహన పెంచుకోవాలన్నారు.

## 110 మంది రోగులకు వైద్య పరీక్షలు

**సారవకోట/జలుమూరు, అక్టోబరు26(వార్త):**సారవకోట మండలం అంగూరు పంచాయతీ సవర అడ్డ పనస, గ్రామ మెయిన్ రోడ్డు వద్ద బీవీకే పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నేషనల్ మేడికోస్ ఆర్గనైజేషన్ సేవా భారతి ఆధ్వర్యంలో, ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సేవా భారతి తరపున వైద్యులు డాక్టర్ వివేక్, సత్య వంశీ, ప్రదీప్, పవన్ తో పాటు సేవా సమితి సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు వాడ పున్నయ్య ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించగా, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వైద్య శిబిరానికి సంబంధించి పలు సేవలను అందజేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు26(వార్త):** జిల్లాలో జరుగుతున్న అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం ఒకటి, రెండు, మహిళా, గార పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోలీసు స్టేషన్లులో ప్రస్తుత కాలంలో పోలీసు శాఖలో సాంకేతికత ముఖ్య పాత్ర, వినియోగం, ఉపయోగంపై ఈ వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిని స్మరించుకోవడం, దేశభక్తి భావాన్ని పెంపొందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.



# ఉద్దానంలో మొంథా గుబులు

### * ఆందోళలో రైతులు
### * తరచూ తుపాన్లతో తల్లడిల్లుతున్న ఉద్దానవాసులు

**సోంపేట, అక్టోబరు 26(వార్త):** వరుస తుపాన్లతో ఉద్దాన రైతులు తల్లడిల్లుతున్నారు. ఉద్దానం ప్రాంతం రైతుల్లో మొంథా తుఫాన్ అప్పుడే అలజడి రేపుతోంది. ఈనెల 28,29 తేదీల్లో అనేక జిల్లాలపై ప్రభావం చూపిస్తుందంటూ ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో పాటు జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించడంతో ప్రజల్లో తుఫాను పట్ల భయాందోళనలు మొదలయ్యాయి. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపు కొత్తూరు తదితర ఉద్దానం ప్రాంత మండలాల్లో ఉద్యాన పంటలపై పెను ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. వేలాది మంది రైతులు ఈ మండలాల్లో ప్రధానంగా కొబ్బరి సాగుపై ఆధారపడి అనేక తరాలుగా జీవితాలను నెట్టుకొస్తున్నారు. గాలులు కూడా తీవ్రంగా ఉంటాయని పేర్కొనడంతో దీని



ప్రభావం కొబ్బరిపై ఉంటే తీవ్రస్థాయిలో మళ్లీ నష్టాలు చవిచూడాల్సి ఉంటుందని రైతుల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. దీంతోపాటుగా ఈ ఏడాది వరి పంట కూడా అన్ని ప్రాంతాల్లోనూ పొట్ట దశకు చేరుకొని రైతులను ఆనందానికి గురిచేస్తున్న వేళ ఇటువంటి తుపాను హెచ్చరికలు మరింత భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ఉద్దానం ప్రాంతంలో 2017లో సంభవించిన తితిలి తుఫాను ఊహించని తీవ్ర నష్టాలను మిగిల్చిన విషయం తెలిసిందే. దానికి తోడుగా 2018లో సంభవించిన హుదూద్ తుఫాను సైతం తానేమి తక్కువ కాదన్నట్టు మిగిలిన మొత్తాన్ని సర్వనాశనం చేసింది. ఆ రెండు తుఫానులతో కోలుకోలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతాంగానికి ప్రస్తుతం ముంథా తుఫాను తీవ్రంగా గుబులు రేపుతోంది. బంగాళాఖాతం తీరంలో ఉన్న శ్రీకాకుళం జిల్లాకు తుపానులు శాపంగా మారాయని చెప్పడంలో సందేహం లేదు. తరచూ తుపానులు, భారీ వర్షాలతో పంటలను కోల్పోతూ బక్కచిక్కుతున్న రైతులు జీవనోపాధి కోసం వలస బాట పడుతున్నారు.



## సరియాపల్లిలో వైసీపీ రచ్చబండ

**మందస, అక్టోబరు26(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన సరియపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రచ్చబండ కార్యక్రమం సర్పంచ్ బత్తిని వెంకట్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు నిరసనగా మందస మండల వైఎస్సార్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన, రచ్చబండ కార్యక్రమం జరిగింది. దీంతో పాటు కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. ప్రభుత్వ వైఖరి పట్ల వైకాపా నాయకులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, మండల పార్టీ నాయకులు పులారి పితాంబరం, బత్తిని లక్ష్మణ్, డాక్టర్ జయరాం, మడియా రామకృష్ణ, దున్న హరికృష్ణ, బెలమర జీవన్, రాపాక శేషగిరి, గౌరకల కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

**సోంపేట, అక్టోబరు26(వార్త):** కంచిలి మండలం మారుమూల గ్రామాలైన డోల గోవిందపురం, పోలేరు గ్రామాల్లో ఆదివారం సేవా భారతి, నేషనల్ మేడికో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. వివిధ వ్యాధులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ మెరుగైన ఆరోగ్యాన్ని పొందాలన్న లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాలలో అవసరమైన రోగులకు మందులు ఉచితంగా అందజేస్తూ హాజరైన రోగులందరికీ బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ గంగా రాజీవ్ దంత వైద్య సేవలను అందించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ తులసి మహిళలకు సంబంధించిన ముఖ్య ఆరోగ్య సమస్యలపై మరింత అవగాహన కల్పించారు. బాల గోవింద పురంలో 130 మందికి, పోలేరులో 40మందికి వైద్య సేవలను అందించారు. ఈ వైద్య శిబిరాల నిర్వాహకులను ఆయా గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్ కుమార్ బి సాయి, డాక్టర్ మదన్‌తో పాటు నిర్వాహకులు తెప్పల రవి, బుద్దాల జయకృష్ణ, రామ చౌదరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచారామాలకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

**శ్రీకాకుళం, అక్టోబరు26(వార్త):** మొదటి కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాకుళం 1 డిపో నుండి పంచారామాలకు మొదటి బస్సు ఆదివారం సాయంత్రం బయలుదేరింది. ఈ బస్సును శ్రీకాకుళం1 డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం 2 డిపో మేనేజర్ శర్మ, 1, 2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





## తుఫాన్ పునరావాస కేంద్రాల పరిశీలన

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26 (వార్త):** తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన బందరువానిపేట, నాగరాలపేట, కళింగపట్నంతోపాటు పలు గ్రామాల్లోని పునరా వాస కేంద్రాలను ఆదివారం శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద సందర్శించారు. తుఫాన్ ప్రభా వంతో ప్రజలు వర్షాలు, గాలులు తీవ్రంగా వీస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితు ల్లోనూ సముద్రతీర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచిం చారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సౌకర్యా లను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ డయల్ 112 లేదా స్థానిక పోలీసు అధి కారులను సంప్రదించాలని తెలిపారు. తుఫాను సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రక్షణ చర్యలను కచ్చితంగా పాటించాలని సూచించారు. తుఫాను ప్రభావం తగ్గిన వరకు ఎట్టి పరిస్థితుల్లో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని కోరారు. ఆయన వెంట శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, గార ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

## తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మందస, అక్టోబరు 26(వార్త):** తుపాను దృష్ట్యా తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, ట్రైనీ ఎస్ఐ టి.వెంకటేశ్ అన్నారు. మందస మండలంలోని ఉద్దాన తీర ప్రాంతంలో గల మత్స్యకార ప్రాంతాలైన రట్టి, భేతాళపురం, గంగువాడ తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు తుపాను ప్రభావాలను వివరించారు. మంతా తుపాను ఆంధ్రప్రదేశ్కు ప్రభావం చూపుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది కె.ఢిల్లేశ్వరరావు, రామారావు కూడా ఉన్నారు.

# యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

### * మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, అక్టోబరు 26 (వార్త):** మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో,ఇతర శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ–ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంతాలకు చేరుకొని జిల్లాలలో తుఫాన్ ప్రభావం పర్యవేక్షణ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రిజర్వాయర్లు,



ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని అధికారులను నిర్దేశించారు. చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నీటి సరఫరా విభాగం అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తుకుండా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# ప్రాణ నష్టం లేకుండా పనిచేయాలి

### * జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర బాబు

**శ్రీకాకుళం, అక్టోబరు26(వార్త):** ప్రాణ నష్టం సున్నా లక్ష్యంగా పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 'గోల్డెన్ అవర్'ను ఏ అధికారి వృథా చేయకుండా, మెరుగైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని జిల్లా ప్రత్యేక అధికారి కె.వి.ఎన్.చక్రధర బాబు ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుఫాను ఈనెల 28వ తేదీన తీరం దాటనున్న నేపథ్యంలో ఆయన ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిలతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కోస్టల్ జిల్లాలు హై అలర్ట్‌లో ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, తిత్లీ తుఫాను అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలని చక్రధర బాబు స్పష్టం చేశారు. తుఫాన్‌ను ఎదుర్కోవడంలో నిర్లక్ష్యం పనికిరాదని, ప్రమాదకర ప్రాంతాలు గుర్తించి, సురక్షితం కాని ఇళ్లలోని ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని ప్రత్యేక అధికారి సూచించారు. గర్భిణీలు, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి పోషకాహార మద్దతు ఇచ్చి, వారి భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది దేనికైనా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ సిబ్బంది కూలిన చెట్లను తొలగించడానికి ట్రీ కట్టర్‌లు డీజిల్ నిల్వలు సిద్ధం చేసుకుని, తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. మానవ పశు ప్రాణనష్టం ఏదీ జరగకూడదని ఆయన లక్ష్యాన్ని నిర్దేశించారు. సహాయక చర్యల కోసం రేషన్ దుకాణాలకు పీడీఎస్ బియ్యాన్ని వీలైనంత త్వరగా పంపాలని చక్రధర బాబు ఆదేశించారు. ప్రత్యేక శిబిరాలలో వంట, పాలు ఇతర అవసరాలు సిద్ధం చేయాలని సూచించారు. రైతులు పొలాల్లో నీరు నిలవకుండా చూసుకుని, పంట నష్టం తగ్గించాలి అన్నారు. అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలని, వర్షాల తర్వాత పారిశుధ్యం సవాలుగా మారుతుందని, వ్యాధులు ప్రబలకుండా చూడటానికి సిబ్బందిని సంసిద్ధం చేయాలని ఆయన కోరారు. మత్స్యకారుల వలలు బోట్లు, చేనేత మగ్గాలు వంటి ఆస్తులకు నష్టం జరగకుండా అధికారులు దృష్టి సారించాలి అన్నారు. 24/7 కంట్రోల్ రూమ్ పని చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లపై జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ జిల్లా ఎస్పీలు ఆయనకు వివరణ ఇచ్చారు. రాబోయే మూడు రోజులు ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, సెల్ ఫోన్ ఆపరేటర్లు విద్యుత్ సరఫరా వ్యవస్థ సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, అధికారుల సూచనలను తప్పక పాటించాలని చక్రధరబాబు కోరారు.

## ముస్తాబైన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం

**జలుమూరు, అక్టోబరు26(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచినా శ్రీముఖలింగేశ్వర స్వామి వారీ ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయ ఎండోమెంట్ అధికారి ఏడుకొండలు మాట్లాడుతూ.. మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని భక్తుల రద్దీని తట్టుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం నాలుగు గంటలకి స్వామి వారికి విశేష పూజలు చేసినానంతరం 4:30 గంటల నుంచి భక్తులకు అనుమతిస్తామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546